
# వానొస్తే.. పవర్ కట్

**చెట్ల కొమ్మలు తగిలి ట్రిప్పవుతున్న ఫీడర్లు**

**సమాచారం ఇవ్వకుండా మరమ్మతులు**

**గంటలకొద్దీ అంతరాయాలపై స్థానికుల ఆగ్రహం**



హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: చిరుజల్లులు కురిసినా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగిలి తరుచూ ఫీడర్లు ట్రిప్పవతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించకపోవడంతో గంటల కొద్దీ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. గాలిలేకలేకపోయినా విద్యుత్‌సరఫరా నిలిచిపోతుందంటూ పలుప్రాంతాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో కురిసిన భారీ వర్షానికి 30కి పైగా ఫీడర్లు ట్రిప్పయితే వాటిలో సగం ఫీడర్లు 2-3గంటల తరువాత అందుబాటులోకి వచ్చాయి. దీంతో స్థానికులు రాత్రంతా చీకట్లో గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. **ప్రమాదకరంగా విద్యుత్ స్థంభాలు..** నగరంలో వందలసంఖ్యలో విద్యుత్‌స్థబాలు ప్రమాదకరంగా మారుతన్న వాటిని మార్చడంలో విద్యుత్‌శాఖ మీనామేషాలు లెక్కిస్తుంది. గాలివానలకు విద్యుత్ స్థంబాలు ఒరిగిపోతున్నా వాటిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా విద్యుత్ తీగలు తెగిపోయి ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చార్మినార్, చాదర్‌ఘాట్ ,అఫ్జల్‌గంజ్, బేగంబజార్, ఎర్రగడ్డ, సనత్‌నగర్, కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట, బోయిన్‌పల్లి, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్థంభాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. విద్యుత్ తీగలు మార్చాలని పలుప్రాంతాల్లో స్థానికులు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. శ్రీనగర్, జూబ్లీహిల్స్, మియాపూర్, చందానగర్, కెపిహెచ్‌బికాలనీ, వసంత్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలకు విద్యుత్ తీగలు తగులుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. **ఇష్టానుసారంగా మరమ్మతులు..** ఏ ప్రాంతంలోనూ విద్యుత్ మరమత్తులు చేయాలన్నా ఆయాప్రాంతాల ప్రజలకు ముందుగా సమాచారం అందించాలి. అయితే నగరంలో అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ మరమత్తులు పేరిట గంటల కొద్దీ పవర్‌కట్ చేస్తున్నారు. రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, సికింద్రాబాద్, హైదరాబాద్ సౌత్, సెంట్రల్,మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో చిరుజల్లులు కురిసినా విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే టోల్ ఫ్రీనెంబర్ 1912కు ఫోన్‌చేసినా ఎంగేజ్ వస్తోందని స్థానిక కార్యాలయాల్లో సిబ్బంది ఫోన్లు పక్కనపెట్టేస్తున్నారని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు విమర్శిస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారి మూడు నాలుగువేల ఫిర్యాదులు అందుతున్నాయి. ఎఫ్ఓసి సిబ్బంది రాత్రిళ్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

హైదరాబాద్ వార్త




# ఆఫర్స్ పేరుతో చీటింగ్

- ఓల్డ్‌స్టాక్ అమ్మకం కోసం బడామాల్స్ అడ్డదారులు
- డిస్కౌంట్‌ల పేరుతో వినియోగదారులకు వల
- తక్కువ ధరకే ఎక్కువ వస్తువులంటూ ప్రచారం
- నాణ్యత లోపంతో మోసపోయామంటూ వినియోగదారుల గగ్గోలు

మహానగరంలో మాయగాళ్లకు కొదవ లేదు. ఎటువైపు నుండి ఎవడు దోచుకుపోతాడో తెలియదు. తక్కువ ధరకే ఎక్కువ వస్తువులు, బైవన్ గెట్‌వన్, భారీగా తగ్గింపులు అంటూ పలు మాల్స్, షోరూంలు వినియోగదారులకు వల వేస్తున్నాయి. వినియోగదారులను తమ దుకాణాలకు రప్పించడం ఎలా ? వారిని ఎలా దోపిడీ చేయాలి? ఉన్నదంతా ఊడ్చేందుకు ఎటువంటి కసరత్తు మొదలు పెట్టాలి? ఇలా వివిధ కోణాలోల ఆలోచిస్తున్న మాల్‌లో ఏర్పాటైన దుకాణాలు, షోరూమ్స్ నిర్వాహకులు వినియోగదారులను వివిధ ఆఫర్ల పేరుతో ఆకట్టుకొని నిలువుదోపిడీ చేస్తున్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: నగరంలో డిస్కౌంట్‌లు,ఆఫర్లు పేరుతో వస్త్ర ప్రపంచంలో కొత్తదందా నడుస్తోంది. సూపర్ సేల్ ఆఫర్, ఫిఫ్టి పర్సెంట్ ఆఫర్, ఒకటి కొంటే మరొకటి ఉచితం అంటూ వినియోగదారులను ఆకర్షించి బురిడీ కొట్టిస్తున్నారు. ఆఫర్ల పేరుతో ఒకమోసమైతే.. ఆఫర్లలో నాసీరకం సరుకుతోపాటు గడువు ముగిసిన ఉత్పత్తులను వినియోగదారులకు అంటగట్టి చేతులు దులుపుకుంటున్నారు. పేరుమోసిన షాపింగ్‌మాల్‌లో ఆఫర్‌లో కొనుగోలు చేస్తే వారం తిరగకముందే బట్టలు చినిగిపోయాయంటూ కర్మన్‌ఘాట్‌కు చెందిన రమేష్‌గౌడ్ ప్రభాతవార్త ప్రతినిధితో వాపోయాడు. తమ కూతురు పుట్టిన రోజు సందర్భంగా గతవారం దిల్‌షుక్‌నగర్‌లోని ఓబడా షాపింగ్‌మాల్‌కు బట్టలను కొనుగోలు చేయడానికి వెళ్తే పలురకాల బట్టలను చూపించి వీటిపై ఆఫర్ ఉందని ఇవి కొనుగోలు చేస్తే 50శాతం డిస్కౌంట్ లభిస్తుందని సేల్స్‌బాయ్ చెప్పడంతో షాపింగ్‌మాల్‌పై నమ్మకంతో కొనుగోలు చేసినట్లు రమేష్ తెలిపాడు. సరిగ్గా వారం తిరగకముందే ఆబట్టలు చినిగిపోవడంతో తనకు పాతస్టాక్ అంటగట్టారని గ్రహించి షాప్‌కు వెళ్లి గొడవకు దిగాడు. దీనికి స్పందించి సదరు నిర్వాహకుడు మీరిచ్చిన డబ్బులకు ఇలాంటి బట్టలే వస్తాయంటూ గద్దించి చెప్పాడు. దీంతో చేసేదేమిలేక మిమ్ముల్ని నమ్మి




కొనుగోలు చేస్తే ఇలా మోసం చేస్తారా అంటూ నిర్వాహాకులపై దుమ్మెత్తిపోశాడు రమేష్‌గౌడ్. ఇలా నగరం లో పలు షాపింగ్ మాల్స్‌లో నిరంతరం ఏదోరమైన మోసాలు జరుగుతూనే ఉన్నాయి.

**గమనించకుంటే అంతేసంగతి..**

వినియోగదారులు సరిగ్గా గమనించకుంటే ఇలానే మోసపోవాల్సి వస్తుంది. వ్యాపారులు ఓల్డ్‌స్టాక్, డ్యామేజ్ బట్టలను అమ్మి చేతలుదులపు కుంటున్నారు. అయితే ఒకటి కొంటే మరొకటి ఉచితం దాంట్లో ఒకటి మంచిగానే ఉంటుంది. అందులో మరొకటి డ్యామేజ్ అయ్యిందో నాణ్యత లేనిదో అంటగట్టేస్తున్నారు. బట్టలు కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడు తాను చెల్లించిన ప్రతి రూపాయికి సంబంధించిన ప్రయోజనాన్ని పొందాలనుకుంటాడు. తాను ఖర్చుపెట్టిన దానికి అసాంతం ప్రయేజనాన్ని కోరుకుంటాడు. కానీ షాపింగ్‌మాల్స్ మోసాలతో మోసపోవాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా వినియోగదారులను ఆకట్టుకునేందుకు పలు రకాల యాడ్స్ రూపంలో వివిధ మీడియాల్లో వస్తుండటంతో వాటిని నాణ్యమైనవిగా నమ్ముతున్నారు. కాబట్టి ఏవస్తువు కొనుగోలు చేసినా దాని నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేస్తే మోసపోకుండా ఉండే అవకాశం ఉందని, లేనిపక్షంలో ఆఫర్ల ముసుగులో దోపిడీకి బలికావాల్సిందేనని పలువురు వినియోగదారుల ఫోరం సభ్యులు తెలుపుతున్నారు.

# ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఉప్పల్ స్కైవాక్

**రూ.25కోట్ల రూపాయలతో నిర్మాణం**

**అందుబాటులో ఎనిమిది లిఫ్టులు,**

**ఆరు స్టేర్ కేసులు, నాలుగు ఎస్కలేటర్లు**



హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : జంట నగరాల శివారు ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండిఎ) త్వరలో ఇన్నర్ రింగ్ రోడ్డు ఉప్పల్ చౌరస్తా వద్ద పాదచారుల రక్షణ కోసం నలువైపులా రోడ్డు దాటేందుకు వీలుగా స్కైవాక్‌ను ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకురానుంది. సుమారు రూ.25కోట్ల రూపాయల వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఉప్పల్ స్కైవాక్ ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నారు. రానున్న వంద సంవత్సరాలకు పైగా ప్రజానీకం సౌకర్యార్థం మనుగడలో ఉండే లక్ష్యంతో పాదచారుల రూపకల్పన జరిగింది. ఉప్పల్ స్కైవాక్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో సుమారు వెయ్యి టన్నులకుపైగా స్ట్రక్చరల్ స్టీల్ వాడకంతో పూర్తిచేశారు. మంత్రి కెటిఆరన ఆదేశాల మేరకు ఈస్ట్ అభివృద్ధిని, పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని మూడు సంవత్సరాల క్రితం మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్‌కుమార్‌కు సూచించారు. సుమారు రూ.25కోట్ల రూపాయల అంచనా వ్యయంతో హెచ్ఎండిఏ రూపొందించింది. ప్రదానంగా ఉప్పల్ చౌరస్తాలో రోడ్డు దాటే సమయంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండట, ప్రమాదాలలో ఎక్కువ శాతం మహిళలు, పాఠశాల విద్యార్థులు గాయపడుతున్న అంశాలను దృష్టిలో పెట్టుకుని స్కై వాక్ నిర్మాణం చేపట్టింది. ప్రాజెక్టు పనులను పరిశీలిస్తే మొత్తం 37 పిల్లర్లు, 660 మీటర్ల పొడవు, మూడు, నాలుగు, ఆరు మీటర్ల వెడల్పు కలిగిన ఉప్పల్ స్కైవాక్ భూమి మీద నుంచి ఆరు మీటర్ల ఎత్తులో ఉంది. మొత్తం 660 మీటర్ల పొడవు కలిగిన ఉప్పల్ స్కైవాక్ బ్యూటిఫికేషన్ లుక్ కోసం పైభాగంలో కేవలం 40శాతం మేరకు రూఫ్ కవరింగ్ ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి 2020 యేడాది చివరల్లో ఉప్పల్ స్కైవాక్ పూర్తికావాల్సి ఉండగా, కోవిడ్ కారణంగా జాప్యం జరిగింది. 90శాతం మేర స్టీల్ వాడకం, వెల్డింగ్ పనుల కోసం ఆక్సిజన్ సిలిండర్‌ల కొరత కారణంగా జాప్యం చోటు చేసుకుంది. ఉప్పల్ చౌరాస్తాలో నలువైపుల సిగ్నల్ ఫ్రీ వాహనాల రాకపోకలరే అవకాశం కలుగుతుంది. ఉప్పల్ మెట్రో స్టేషన్ ద్వారా ప్రతి రోజు సాధారణంగా సుమారు 25 నుంచి 3వేల మంది ప్రయాణీకుల రద్దీ ఉంటుంది. స్కై వాక్ ద్వారా నలువైపుల వారి గమ్యస్థానాలకు చేరుకునే అవాకశం ఉంది.లిఫ్టులు, మెట్ల మార్గాల పరిసరాల్లో హెచ్ఎండిఎ అర్బన్ ఫారెస్టు యంత్రాంగం మొక్కలు పచ్చిక బయలతో పచ్చదనాన్ని పెంచుతుంది.

# గోడకూలి 8నెలల చిన్నారి దుర్మరణం



**ఓంనగర్‌లో వర్షానికి నిర్మాణంలో ఉన్న గోడ కూలి మృతి చెందిన జీవనిక**

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం డివిజన్ పరిధిలోని ఓంనగర్‌కు చెందిన శ్రీకాంత్, జయదేవి దంపతులకు కడుపుకోతను మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే బస్తీలో రమణ,అరుణ దంపతులు నాలుగు అంతస్తుల బిల్డింగ్ నిర్మిస్తున్నారు. ప్లాస్టింగ్ లేకపోవడం కారణంగా రాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలి పక్కనే ఉన్న రేకుల ఇంటిలోకి పడడంతో అక్కడ నిద్రిస్తున్న, శ్రీకాంత్, జయదేవి దంపతుల రెండవ సంతానం 8 నెలల కూతురు జీవనిక అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందటంతో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఘటనకు కారణంకు కారణమైన రమణ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు భాదిత కుటుంబాన్ని స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు లంకాల దీపక్‌రెడ్డి, కీర్తి రెడ్డి పరమార్శించారు. లంకాల దీపక్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ సంబందితశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొనే విధంగా కృషి చేస్తామన్నారు. బీజేపీ పార్టీ చిన్నారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటుదని హామీ ఇచ్చారు. అనంతరం చిన్నారి జీవనిక తల్లి జయదేవి మాట్లాడుతూ బస్తీలోని చిన్న స్థలంలో అవకాశం లేకపోయినా నాలుగు, ఐదు అంతస్తులతో నిర్మాణం చేపట్టి చుట్టుపక్కల వారి ప్రాణాలను తీస్తున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాని కోరారు. అధికారులు కూడా డబ్బులకు ఆశపడి అక్రమ నిర్మాణాలను చూసీ చూడనట్లు వ్యవహార్తిస్తున్నటువంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# వచ్చే నెల 2న బల్కంపేట ఎల్లమ్మ పాలక మండలి ప్రమాణ స్వీకారం



**బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం అధికారులతో సమావేశమైన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు**

అడ్డగుట్ట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: నగరంలో ప్రసిద్ధిగాంచిన బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో నూతనంగా నిర్మించిన షాపులను వచ్చే నెల 4వ తేదీన ప్రారంభించనున్నట్లు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ క్రిష్ణ, ఆలయ ఈఓ అన్నపూర్ణలతో సమావేశమైయ్యారు. బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అదే విధంగా ఆలయ నూతన పాలక వర్గ కమిటీని వచ్చే నెల 2వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఆది,మంగళ, శుక్రవారాల్లో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకుంటారని వివరించారు. వారికి ఎలాంటి అ సౌకర్యాలు కలుగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, బిఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రావ్, ఆలయ నూతన కమిటీ ప్రతినిధులు నర్సింహ్మా, యాదగిరి, సుబ్బారావ్, సంతోష్,రాజా రెడ్డి, గౌతమ్ రెడ్డి, అంజనేయులు యాదవ్, ప్రభుగౌడ్, అనీల్‌కుమార్, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒయులో ముగిసిన కక్ష్ 2023 వేడుక

**వైఫల్యాలకు ఎప్పుడు భయపడవద్దు : విశ్రాంత వింగ్ కమాండర్ రాకేష్ శర్మ**




**అశోకచక్ర వింగ్ కమాండర్ రాకేష్ శర్మకు జ్ఞాపికను అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్**

తార్నాక, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: వైఫల్యాలకు ఎప్పుడు భయపడవద్దని విశ్రాంత వింగ్ కమాండర్,అశోక చక్ర ఆవార్డు గ్రహిత రాకేష్ శర్మ పేర్కొన్నారు. ఓ.యూ ఆవిర్భావ దినోత్సవం ముంగిపు వేడుకలకు వింగ్ కమాండర్ రాకేష్ శర్మ హాజరై మాట్లాడుతూ గ్లోబల్ ఎకనామీకి ఆజ్యం పోసేందుకు వనరులను అన్వేషించడానికి అంతరిక్షయాత్రలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. జురాసిక్ యూగంలోని డైనోసార్లు, రాకాసి బల్లులు భూమిని గ్రహశకాలాలు ఢీకొన్నప్పుడు వాటికి బ్యాకప్ చేసేందుకు జన్యువులు లేందున అవి అంతరించిపోయినట్లే హ్యూమన్ జీనోమ్ కు బ్యాకప్‌లు లేవు కాబట్టి ప్రత్యామ్నాయాలను కనుగొనడం అవసరమని చెప్పారు. మనం చంద్రునిపై లేదా ఇతర గ్రహాలపై జీవించడానికి అన్వేషించే ముందు భూతల్లికి నష్టాన్ని చేయడం మానుకోవాలని హితవు పలికారు.ఈ సందర్భంగా అంతరిక్షంలో అడుగు పెట్టిన తొలి భారతీయుడు, ఓ.యూ పూర్వ విద్యార్థి వింగ్ కమాండర్ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాదానాలు ఇచ్చారు. తాను వ్యోమోగామిగా ఎదుర్కొన్న అతి కఠినమైన పరిస్థితులను రాకేశ్ శర్మ విద్యార్థులతో పంచుకున్నారు. వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ రెండేళ్లలో ఓ.యూ సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఓ.యూ కేంద్రంగా విద్యా సంబంధ అవసరాలను తీర్చేందుకు త్వరలో సాటిలైట్ ఛానెల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇండోపసిఫిక్ అధ్యయన కేంద్రం, హ్యుమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఓ.యూ కీర్తిమరింత ఇనుమడింపజేస్తాయని వెల్లడించారు. అనంతరం యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.జి.మల్లేశం మాట్లాడుతూ అంతరిక్షంలోకి ప్రవేశించిన మొదటి భారతీయుడు రాకేశ్ శర్మ ఓ.యూ వ్యవస్థాపక దినోత్సవానికి గర్వకారణమన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూజీసీ సభ్యులు, ఇఫ్లూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఇ.సురేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మినారాయణ, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.జి.మల్లేశం, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొ.బి. రాజేందర్ నాయక్, సీఈసీ డైరెక్టర్ ప్రొ.జె.బి.నడ్డాతో పాటు పలువురు విద్యార్థులు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, పరిశోధకులు, ఆయా విభాగా అధిపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాటిచెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి



**తాటిచెట్టుపై నుండి పడి మృతి చెందిన అబ్బయ్య**

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: తాటిచెట్టుపై నుండి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, అనాజ్‌పూర్ గ్రామంలో గౌడ కులానికి చెందిన కారింగుల అబ్బయ్య (56) బుధవారం ఉదయం 9 గంటలకు రోజు మాదిరిగానే కల్లు గీయటం కోసం ఊరి దగ్గరలోని సర్వే నెంబర్ 248లి పాపిరెడ్డి పొలంలో తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు చెట్టుమీద నుండి కింద పడడంతో తలకు, ఇతర శరీర అవయవాలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని వనస్థలిపు రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి చనిపోయాడని తెలిపారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాజేంద్రనగర్ కొండను పరిశీలించిన అధికారులు




**పరిశీలిస్తున్న హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి బుధవారం సీనియర్ ఇంజనీర్లతో కలిసి రాజేంద్రనగర్ కొండను పరిశీలించారు. సుమారు 1.3కిలోమీటర్ల పొడవుగల విమానాశ్రయ మెట్రో అలైన్‌మెంట్‌తో పాటు నిటారుగా ఉండే ఎత్తులు, బండరాళ్ళు, లోయలు ఉన్న ఈ కొండపై విమానాశ్రయ మెట్రో నిర్మాణం చాలా కష్టమైన పని అని, నిటారుగా ఉన్న వాలులు, బండరాళ్లను అధిరోహిస్తూ ఎన్‌విఎస్.రెడ్డి ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను పరిశీలించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మెట్రో అలైన్‌మెంట్, ఓఆర్ఆర్ క్రాష్ బారియర్ మధ్య గ్యాస్ దాదాపు 18 అడుగులు మాత్రమే ఉండి, ఓఆర్ఆర్‌లోతైన కటింగ్‌లో ఉన్నందున, ఓఆర్ఆర్ వైపు ఎటువంటి బండరాళ్ళు పడకుండా తగిన బలం, ఎత్తుతో కూడిన రక్షణ బ్యారియర్లను అమర్చాలని, బౌల్డర్ స్టెబిలైజేషన్ పద్ధతులను నిపుణులతో సంప్రదించి అవలంభించాలని, ఏదైనా సంఘ విద్రోహ కార్యకలాపాల నుంచి మెట్రో వయాడక్ట్‌ను రక్షించడానికి విమానాశ్రయం మెట్రోకు ఎడమవైపున రక్షిత ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని, ఆక్రమణలను నిరోధించడానికి ప్రక్కనే ఉన్న ప్రైవేట్ ఆస్తుల నుంచి విమానాశ్రయ మెట్రో ప్రాంతాన్ని ఆక్రమణలు లేకుండా హెచ్ఎండిఏతో సంప్రదించి సరిహద్దు సర్వే రాళ్ళను ఏర్పాటు చేయాలని, రాతిని తొలగించే అవసరం నివారించడానికి స్టబ్‌లు లేదా తక్కువ ఎత్తు ఉన్న స్తంభాలపై మెట్రో వయాడక్ట్‌ను నిర్మించే అవకాశం పరిశీలించాలని, ఓఆర్ఆర్ డ్రైనేజీ వ్యవస్థలోకి వర్షపు నీరు ప్రవహించేలా కొండపై హెచ్ఏఎంఎల్ నిర్మించిన తాత్కాలిక రహదారి లోయ పాయింట్ల వద్ద తగినంత వ్యాసార్థంతో కూడిన హ్యూమ్ పైపులతో క్రాస్ డ్రెయిన్‌లు ఏర్పాటు చేయాలని,కొండపై దాదాపు 2300 మీటర్ల వరకు మిగిలిన విస్తీర్ణంలో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేయడాన్ని రాబోయే కొద్దిరోజుల్లో పూర్తి చేయలని ఆదేశించారు. ఈ పరిశీలిన కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు మెట్రో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్‌మోహన్, జిఎం ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఈ వై.సాయిపరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్(రైల్వే) జెఎన్.గుప్తా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# చెరువులలో కబ్జాలపై చర్యలు చేపట్టండి

**లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తాం: కెఎంసి చైర్మన్ శ్రీశైలంయాదవ్**



**తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్**

దుండిగల్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని పలు చెరువులలో మట్టి నింపి కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ బుధవారం గండిమైసమ్మ-దుండిగల్ మండలం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంపల్లి పరిధి సర్వేనంబర్ 288,2/పి,24, 25, 26, 27/పి, 28/పి, 40/పి, 42/పి, 44/పి, దూలపల్లి పరిధి సర్వేనంబర్ 1లలో గల చెరువులలో గత కొంతకాలంగా గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా మట్టి నింపుతూ కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికే దాదాపు 6వేలకు పైగా ట్రిప్పుల మట్టిని నింపారన్నారు. ఈవిషయమై కొద్దిరోజుల క్రితం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎలాంటి ఫలితం లేదన్నారు. విషయాన్ని స్వయంగా తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చిన అనంతరం మట్టి నింపడం అధికారుల ఉదాసీన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. అధికారుల తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు. చెరువుల కబ్జాలపై ప్రజలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారని కబ్జాలపై పురపాలక సంఘంకు 50కి పైగా ధరఖాస్తులు అందడంతో మరోసారి తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టకపోతే న్యాయస్థానంను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గుప్త నిధుల కోసం వెళ్తే.. సొరంగంలో నాగు పాము

**పరుగులు తీసిన యువకులు**

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ముష్క్‌మహల్‌లో సొరంగం కలకలం రేపుతోంది. నలుగురు యువకులు గుప్త నిధులు ఉంటాయనే ఉద్దేశ్యంతో సొరంగం లోపలకు వెళ్లగా అక్కడ వారికి అక్కడ నాగుపాము కనిపించటంతో భయంతో సొరంగం నుంచి బయటకు పరుగులు తీశారు. అత్తాపూర్ సమీపంలో పురాతనమైన ముష్క్‌మహల్ ఉంది. నలుగురు యువకులు ముష్క్‌మహల్‌లోని సొరంగం లోపలకు కొంత దూరం వరకు వెళ్లారు.యువకులకు అక్కడ పెద్ద నాగుపాము కనిపించింది.నాగుపామును చూసిన యువకులు భయంతో సొరంగం నుంచి బయటకు పరుగెత్తారు. ఈ విషయం స్థానిక ప్రజలకు తెలియటంతో ప్రజలు ముష్క్‌మహల్‌ను చూడటానికి తరలి వచ్చారు.కాగా ముష్క్‌మహల్‌లో గుప్త నిధులు ఉండవచ్చునని ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని సంప్రదించగా అలాంటిదేమి లేదని స్పష్టం చేశారు.

# 29 నుంచి పాస్‌పోర్టు స్పెషల్‌డ్రైవ్

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: కరోనా తర్వాత పాస్‌పోర్టులకు మళ్లీ డిమాండ్ భారీగా పెరిగింది. దాదాపు మూడేళ్లపాటు విదేశాలకు రాకపోకలు నిలిపివేయడం జనాలు స్థిరంగా ఉండిపోయారు. ఇటీవల మళ్ళీ విదేశాల బాటపట్టేందుకు రెడీ అవుతున్నారు. దీంతో స్టడీ,జాబ్, టూరిస్టు వీసాలకు డిమాండ్ బాగా పెరిగింది. కరోనా తర్వాత పాస్‌పోర్టు దరఖాస్తు చేసుకుంటే కేవలం రెండుమూడు రోజుల్లోనే స్లాట్‌దొరికేది కానీ ప్రస్తుతం ఒకస్లాట్ బుక్ కావడానికి 30నుంచి 40రోజుల టైం పడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాస్‌పోర్టు సేవా కేంద్రం ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. దీనివల్ల ఆఫీసుల చుట్టూ తిరిగేవాళ్ల సమయం అదా అవ్వడమే కాకుండా రద్దీ తగ్గడం, పాస్‌పోర్టు పని తొందరగా జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఏప్రిల్ 29 నుంచి ప్రతి శనివారం పాస్‌పోర్టు సేవా కేంద్రాలు తెరిచి ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా వాటి ద్వారా 3,056 కొత్తస్లాట్లు విడుదల చేస్తారు. ఈడ్రైవ్ వల్ల కొత్తవారితోపాటు ఎక్కువ రోజుల గ్యాప్‌తో స్లాట్ బుక్ చేసుకున్న వాళ్లు రీ షెడ్యూల్ చేసుకోవచ్చు. పాస్‌పోర్టు డ్రైవ్‌లో కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఒకొక్కటి చొప్పున హైదరాబాద్ సిటీలో బేగంపేట్, అమీర్‌పేట్, టోలీచౌకి ప్రాంతాల్లో కొత్తకేంద్రాలు ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకునేవాళ్లు ఏప్రిల్ 27 గురువారం సాయంత్రం 4గంటల నుంచి పాస్‌పోర్టు సేవా వెబ్‌సైట్ యాప్ ద్వారా అపాయింట్‌మెంట్ కోసం నమోదు చేసుకోవచ్చు.

## మహిళలు స్వయం ఉపాధి పథకాల్లో ప్రతిభ కనబర్చాలి : జంపనప్రతాప్



1వ వార్డు పెద్దతోకట్టలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి పథకం కింద కుట్టు శిక్షణలో ప్రతిభకనబర్చి మరికొందరికి ఉపాధి కల్పించే విధంగా అభివృద్ధి చెందాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ 1వ వార్డు పెద్దతోకట్ట ప్రాంతానికి చెందిన మహి ళలు కుట్టు శిక్షణ నేర్చుకునేందుకు తన సొంత నిధులతో 4 మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ గత జనవరి 26వ తేదీన బస్తీని సందర్శించినప్పుడు తమకు కుట్టు మిషన్లు అందజేసి కుట్టు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక మహిళలు తన దృష్టికి తెచ్చారన్నారు. తన మనువడు జంపన రుషిత్ జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో కుట్టు మిషన్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు వాసంతి, భాగ్య, స్వరూప, స్పందన, అండాలమ్మ, బస్తీ పెద్దలు బాబురావ్, శ్రీనివాస్, సతీష్, నవీణ్, ముఖేశ్,వర తదితరులు పాల్గొన్నారు.

## యావత్ హిజ్రా, ట్రాన్స్‌జెండర్ల సమాజాన్ని దోషులుగా చూడరాదు

### మీడియా, పౌర సమాజానికి వినతి



సమావేశంలో మాట్లాడుతున్న అవంతిక

సైఫాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: ఇటీవల సనత్‌నగర్‌లో 8 ఏళ్ళ బాలుడిని హిజ్రాగా చెప్పుకుంటున్న ఒక వ్యక్తి దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పలవురు హిజ్రాలు, ట్రాన్స్ జెండర్‌లు తెలిపారు. దోషులు ఎవరైన శిక్షించాల్సిందేనని, పోలీసుల నిష్పాక్షపాతం విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణమ్మ, అవంతిక, ప్రియామూర్తి, విమల, మెనాలిసా, స్టేలా, శోభ, వైజయంతి, వాణి, జోయ, జాస్మి తదితరులు మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలలో నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులు ఉన్నట్లే హిజ్రా, ట్రాన్స్ జెండర్లలో కూడా ఉంటారని చెప్పారు. కాగా ఒక వ్యక్తి చేసిన తప్పుకు యావత్ హిజ్రా, ట్రాన్స్ జెండర్లను దోషులుగా చూడటం సమంజసం కాదన్నారు. కుటుంబాల నుంచి, సమాజం లోని అన్ని వసతుల నుంచి, వ్యవస్థల నుంచి బయటకు నెట్టివేయబడ్డ తాము ఇప్పుడిప్పుడేసమాజంలో ముందకు వస్తున్నామని, హక్కులను పొందుతున్నామని, సమాజానికి తమవంతు తోడ్పాటు అందిస్తూ ఒక్కటయ్యే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఈతరుణంలో కొన్ని దుర్ఘటనలు ఆధారంగా చేసుకుని తమ సమాజాన్ని ఆదే దృక్పథంతో చూడటం సమంజసం కాదన్నారు. పై విషయాలను దృష్టిలో పెట్టు కుని మీడియా, పౌర సమాజం హిజ్రా, ట్రాన్స జెండర్ సమాజంపై నిందలు వేయరాదని వారు విజ్ఞప్తి చేశారు.

## సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న కార్పొరేటర్లు శేషగిరి, జగన్ తదితరులు

దుండిగల్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు బుధవారం ప్రభుత్వ విప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈసందర్భంగా తమతమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలతో పాటు పలు వురు వివిధ శుభకార్యాలయాలకు హాజరు కావాలంటూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరితంగా పరిష్కరిస్తానని హామినిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, ఆయా కాలనీల సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వారణాసిలో భక్తులకు దశ ఆశ్వమేధ ఘాట్ వద్ద ఉచితంగా మజ్జిగా, అల్పహారం పంపిణి ప్రారంభం



ఉస్మాన్‌గంజ్‌లో ఉచిత మజ్జిగ పంపిణి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ,విజయ్‌బాస్కర్,మెడిశెట్టి రాకేష్

అఫ్జల్‌గంజ్,ఏప్రిల్ 26ప్రభాతవార్త: పవిత్ర పుణ్యక్షేత్రమైన కాశీ వారణాసిలో 12ఏళ్ల కొకసారి వచ్చే పుష్కరాలు ఈసారి గంగానదికి రావడంతో భాగ్యనగర్ అయ్యప్ప సేవాసమితి ఆద్వర్యంలో దశ ఆశ్వమేథ ఘాట్ వద్ద వచ్చే భక్తులకు ఉచితంగా మజ్జిగా, ఆల్పహారం అందిస్తున్నామని సమితి అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ,ప్రధాన కార్యదర్శి రాకేష్ లు పేర్కొన్నారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిలో మండుతున్న ఎండల్లో ఘాట్‌కు వచ్చే భక్తులకు కొంత మేరకు దప్పిక తీర్చేందుకు,ఉడతాభక్తిగా ఉచితంగా మజ్జిగా అందచేయనున్నట్లు వారు వివరించారు.తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడర్స్ సంయుక్తా ఆద్వర్యంలో 33మంది అనాథ చిన్నారులకు అక్కున చేర్చుకుని వారికి,విద్య,వసతి,భోజనం అందిస్తున్నట్లు తెలిపారు.అదే విధంగా ఉస్మానియా ఆసుపత్రిలో 365 రోజుల పాటు రోగి సహాయకులకు ఆర్‌ఓయువీ ప్లాంట్, హెల్ప్‌ఏ వీడి సంస్థ ద్వారా మంచినీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కనిశెట్టి వెంకటేశం,నర్సింగ్,నరేందర్,మధు,నార్ల జగదీష్,శ్రీహరి,భిక్షపతి,అశోక్,అమర్‌నాథ్ పాల్గొన్నారు

## ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలి

### హింద్ మజూర్ సభ డిమాండ్



డిమాండ్లు పరిష్కరించాలని నినదిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం హెచ్‌ఎంస్ ప్రతినిధులు

హైదరాబాద్, ఏప్రిల్ 26,ప్రభాత వార్త: బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను నిలబెట్టుకో వాలని హింద్ మజూర్ సభ డిమాండ్ చేంది. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో హెచ్‌ఎం ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ అసంఘటిత కార్మికులు (కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్) సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, హెచ్ఎంఎస్ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టియు అధ్యక్షులు శ్రీనివాస్, ఐఎన్‌టియుసి కార్యదర్శి చంద్రశేఖర్ హెచ్ఎంఎస్ కార్యదర్శి కానిగంటి రాజు, టిఎస్‌యుఎస్ అధ్యక్షులు కామెర గట్టయ్య తదితరులు హాజరై ప్రసంగిం చారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కనీస వేతన జీవోలు ఇచ్చినప్పటికీ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. అందుకు కారణం పరిశ్రమల నుంచి వస్తున్న వత్తిడే కారణమన్నారు. అలాగే ఆర్టీసి, సింగరేణి కంపెనీలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ఆర్టీసిలోకూడా 61సంవత్స రాలుకు పెంచి పేరివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్, సభ్యులు రాజీనామా చేసి చాలారోజులు అయినప్పటికీ మళ్లీ కొత్తకమిటీని నియమించలేదని అనేకరంగాల్లో కనీస వేతన సవరణ జరగలేదని కావున వెంటనే కొత్తసభ్యులను నియమించాలన్నారు. కార్మికుల వేతనాలతో నడుస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రిలో కుంభకోణాలు జరిగినప్పటికీ ఇప్పటివరకు అవినీతి వర్గాలపై చర్యలు తీసుకోలేదని వెంటనే వారిపై చర్యలు తీసుకుని ఆస్పత్రిలో అన్నిరకాల మందులు ఏర్పాటు చేసి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

## పేదల ఆరోగ్య సంరక్షణకై సిఎం బస్తీ దవాఖానాల ఏర్పాటు: ఎమ్మెల్యే కాలేరు



తిలక్‌నగర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ అమృత

హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. ఇందులో భాగంగానే పేదల ఆరోగ్య సంరక్షణ కోసం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. బుధవారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే, కార్పొరేటర్ అమృత కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలేరు మాట్లాడుతూ బస్తీ ప్రజల ఇంటికి సమీపంలోనే బస్తీ దవాఖానాలను సిఎం ఏర్పాటు చేసి వైద్య సేవలు లభించేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రతి బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, స్టాఫ్ నర్సు అందుబాటులో ఉంటారని, ఓపితోపాటు ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు, గర్భిణిస్త్రీలకు, బాలింతలకు, పిల్లలకు టీకాలు వేయడం, కుటుంబ నియంత్రణపై కౌన్సిలింగ్, రక్తహీనత, బిపి, షుగర్, క్యాన్సర్ పరీక్షలు మొత్తం 57 రకాల పరీక్షలతోపాటు ప్రాథమిక చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తిపటేల్, బిఆర్ఎస్ పార్టీ నలకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, న్యాయవాది సత్యనారాయణ, అధికారులు, వైద్యసిబ్బంది, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



యువతకు క్రీడా సామాగ్రి పంపిణి చేస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

## యువత క్రీడల్లో రాణించాలి

### కార్పొరేటర్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ బుధవారం డివిజన్‌లోని చంద్రనగర్‌లో పిల్లలకు, యువతకు క్రీడా సామాగ్రి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడలు యువత శరీరదారుఢ్యానికి, ఉత్సాహానికి, ఉల్లాసానికి ఎంతోగానో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు జె నవీన్, నర్సింగ్‌గౌడ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### భారీ వర్షాలకు అరుంధతినగర్‌లో మోకాలలోతు నీళ్లు, అధికారులు, నేతల సందర్శన

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్‌లో గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు మోకాలులోతు నీటితో బస్తీ వాసులు పడ్డ ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు బిఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠాజైసింహ బుధవారం పర్యటించారు. వెంటనే ఇరిగేషన్ శాఖ అధికారి ప్రవీణ్‌కు సమాచారం అందించడంతో ఆయనకు బస్తీకి చేరుకుని సమస్యను వెంటనే పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత ముఠానరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, రాజ్‌కుమార్, నాగుల ప్రకాశ్, సరస్వతి, సుధా, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శతాబ్ది పైనాల్ పనులకు శంకుస్థాపన



ఒయు శతాబ్ది పైలాన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్, రిజిస్ట్రార్ లక్ష్మినారాయణ

తార్నాక, మార్చి 26 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కళాశాల ఆవరణలో రూ.70లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఒ.యూ శతాబ్ది పైలాన్ పనులకు వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ ఎకరం స్థలం ఏర్పాటు చేయనున్న పైలాన్ పనులను మూడు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒ.యూను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేదిశగా ప్రణాళికలతో ముందుకెళ్లుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.ఇ.సంజీవ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ షఫితో పాటు డైరక్టర్లు, ప్రిన్సిపాల్స్, హెడ్, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెద్దలు ధరణి పేరుతో భూదోపిడీకి పాల్పడ్డారు

### కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వ పెద్దలు ధరణి పేరుతో భూదోపిడీకి పాల్పడ్డారని కాంగ్రెస్ నేత బక్కజడ్సన్ అన్నారు. ధరణి పోర్టల్ రైతుల పాలిట భూతంగా తయారైందని విమర్శించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దోచుకున్న సొమ్మును దుబాయి మీదుగా అమెరికాకు తరలించి టెక్సాస్‌లో బినామా పేర్లతో భూములకు కొంటున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ ఉపయోగించుకుని చాలా భూముల కొల్లగొట్టారని అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఇలా రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లి రెవెన్యూ గ్రామం లోని పలుసర్వే నెంబర్లలో జరిగిన లావాదేవీలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సర్వే నెంబర్లలో జరిగిన లావాదేవీల్లో డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి. ఆ డబ్బులు ఎవరెవరికి వెళ్ళాయి అన్నదానిపై సమగ్ర విచారణ చేయాలని జడ్సన్ డిమాండ్ చేశారు.

## నాదోపాసనతో భగవంతుని చేరుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు త్యాగరాజు

### తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్



త్యాగరాజ జయంతి ఉత్సవాలలో మాట్లాడుతున్న జూలూరి గౌరీ శంకర్

ధర్నాచౌక్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: నాదోపాసనతో భగవంతుని చేరుకోవచ్చని నిరూపించిన గొప్ప వాగ్గేయకారుడు త్యాగరాజని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. బుధవారం త్యాగరాజస్వామి 256వ జయంతి ఉత్సవాలు ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు గౌరీశంకర్ ముఖ్య అతిథిగా హాజరై త్యాగరాజ స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌరీశంకర్ మాట్లాడుతూ తెలుగునేలపై పుట్టిన త్యాగరాజు కర్నాటక శాస్త్రీయ సంగీత సామ్రాజ్యాన్ని అధిరోహించటం తెలుగువారిగా మనకెంతో గర్వకారణమని అన్నారు. త్యాగరాజకీర్తనలకు బహుళ ప్రచారం కల్పించటానికి తెలంగాణ సాహిత్య అకాడమీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, హరిహర ఫౌండేషనన వ్యవస్థాపక అధ్యక్షులు మారడాని శ్రీనివాసరావు, అశ్విన్, నరసింహ, రాంబాబు పాల్గొన్నారు.

## తెలుగుజాతి ఒక్కటేనని చాటుతున్న తెలుగు సంస్కృతి సంప్రదాయకళలు



సాయికుమార్ దంపతులను సత్కరిస్తున్న దీపక్, భారతి, వర్మ, రాజేష్

రవీంద్రభారతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : విశ్వవ్యాప్తంగా ఎవరు ఏ హోదాలోవున్నా మూలాలు మరచిపోకుండా తెలుగు వారంతా ఒక్కటేనని చాటిచెప్పడానికి మూలకారణం తెలుగుజాతి సంస్కృతి, సంప్రదాయాలు, కళలేనని తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (తాల్) ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగిన ఉగాది వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ నటుడు సాయికుమార్ అన్నారు. లండన్ తదితర విదేశాలలో తెలుగుభాష, సంస్కృతి పరిరక్షణకు తాల్‌చేస్తున్న సేవలు అమోఘం, అనితరసాధ్యమని కొనియాడారు. ఈ సందర్భంగా సాయికుమార్ తన 5దశాబ్దాల సినీప్రస్థానాన్ని వివరిస్తూ అద్భుతమైన డైలాగ్‌లు చెప్పి సభికులను కేరింతలు కొట్టించి ఆనందడోలికల్లో ముంచెత్తారు. ఈ వేడుకల్లో లండన్ హైకమిషన్ ఆఫ్ ఇండియా దీపక్‌చౌదరి, పర్వతారోహకుడు అన్మిష్‌వర్మ, తాల్ అధ్యక్షురాలు కందుకూరి భారతి, ఉపాధ్యక్షుడు తేలేటి రాజేష్, ట్రస్టీలు గిరిధర్, అనిత తదితరులు పాల్గొని సాయికుమార్ దంపతులను ఘనంగా సత్కరించడంతోపాటు ప్రముఖ వైద్యనిపుణుడు డా. రఘురామ్ పిల్లారిశెట్టిని తాల్ జీవనసాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు వివిధ నృత్యాలతో అలరించగా, ప్రముఖ సినీనేపథ్య గాయకులు హారికా నారాయణ్, అరుణ్ కౌండిన్యలు ఆణిముత్యాల్లాంటి పాటలను సినీసంగీత విభావరిలో వీనులవిందుగా ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించి సంగీతలోకంలో విహరింపజేశారు. యాంకర్ శ్యామల, కెవ్వు కార్తీక్, ఆర్‌జె శ్రీవల్లిలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని మరింత రక్తికట్టించారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు టిపిసిసి కార్యనిర్వాహక కార్యదర్శి పర్వాతాల రాజేందర్ అన్నారు. బుధవారం జంగమ్మెట్ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద ఆయన చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్, మణిశంకర్, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

## ఇళ్లలోకి చేరిన వర్షం నీరు



లోతట్టు ప్రాంతంలో నిలిచిపోయిన వర్షం నీటి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: జాంబాగ్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌బాబా దర్గా,సుబాన్‌పురా తదితర ప్రాంతాలలో వర్షం నీరు ఇళ్లలోకి చేరడంతో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. పాత సివరేజ్‌లైన్ పైపులైన్ ఉండటం మూలంగా వర్షం కురిసినప్పుడు ల్లా పరిస్థితి పునరావృత్తం అవుతుందని స్థానికులు బిఆర్ఎస్ నాయకులకు విన్నవించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల కాలంలో ఈ ప్రాంతంలో కొత్త పైపులైన్ నిర్మాణం పనులు చేపట్టే విధంగా కృషి చేస్తానని స్థానికులకు ఆనంద్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. చిన్న,చిన్న ఇండ్లలో నివాసం ఉంటున్న వారికి అనేక అవస్థలకు గురవుతున్నట్లు అన్నారు. అధికారులతో మాట్లాడి నిలిచిపోయిన నీటిని తొలగింప చేశారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.నందుకుమార్, బీర్జు కుమార్ జైస్వాల్, మహ్మద్ అన్వర్, మహమ్మద్ అఫ్జల్ ,మూస అలీ,మహ్మద్‌రఫీక్,సయ్యద్‌అసద్,సయ్యద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే పిలవడం లేదు అనడం అవాస్తవం

### దుష్ప్రచారంపై వివిధ వివిధ డివిజన్ల అధ్యక్షుల ఖండన



ఆహ్వానపత్రిక అందించిన ఫోటోలను చూపుతున్న బిఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్, ఏప్రిల్ 26,ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నుంచి ఆహ్వానం లేదని కొంతమంది పార్టీ నాయకులు ప్రచారం చేయడంలో వాస్తవం లేదని ఆపార్టీ డివిజన్ అధ్యక్షులు తెలిపారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట్‌లో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ డివిజన్ అధ్యక్షులు సిద్దార్థ ముదిరాజ్, మేడి ప్రసాద్, భీష్మాలు మాట్లాడుతూ ముందు నుంచి ఆత్మీయ సమ్మేళనాలకు పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం తాము స్వయంగా అందించామన్నారు. అలాగే మాజీ మంత్రి కృష్ణయాదవ్ గత కొద్దిరోజులుగా రోజుకో బిజెపి నాయకుడిని కలుస్తూ ఫోటోలు దిగుతున్న వ్యక్తిని బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు ఎలా ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. కృష్ణయాదవ్ బిఆర్ఎస్ పార్టీకి చేసిందేమీ లేదని వారు విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌పై చవకబారు దుష్ప్రచారం, అవాస్తవాలు మానుకోవాలని లేకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్‌గౌడ్, పులిజాల గెల్వయ్య, సంతోష్, భూపతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ట్రేడర్‌సెల్ అధ్యక్షులుగా బబుత్‌సింగ్ రాజ్‌పురోహిత్



గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ట్రేడర్స్ సెల్ అధ్యక్షులు బబ్బుత్‌సింగ్ రాజ్‌పురోహిత్ నియామకం

బేగంబజార్,ఏప్రిల్ 26ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ట్రేడర్‌సెల్ అధ్యక్షులుగా బబుత్‌సింగ్ రాజ్‌పురోహిత్‌ను నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకి షోర్‌వ్యాస్ బిలాల్ నియమించారు.ఈమేరకు బిఆర్ఎస్ కార్యాలయంలో బబుత్‌సింగ్‌కు నియామకపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో వ్యాపారులకు అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారులకు నమ్మకం పెరిగిందన్నారు. బబుత్‌సింగ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గం బిఆర్ఎస్ ట్రేడర్‌సెల్ అధ్యక్షులుగా నియమించినందుకు నందకిషోర్‌వ్యాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌పురోహిత్ సమాజ్ ప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు శంకర్ రాజ్‌పురోహిత్ పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన మహానీయుడు ఎన్టీఆర్


### టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్‌గౌడ్ ఈనెల 8న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్

ధర్నాచౌక్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్ గౌడ్ కొనియాడారు. త్వరలో జరగబోయే ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఉద్దేసించి లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధిస్టానం ఆదేశాలమేరకు ఈనెల 8న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఇరు తెలుగు రాష్ట్రాలలో జరపుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజా మాన్షన్ నందు నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు టీడీపీ అభిమానులు, ఎన్టీఆర్ అభిమానులు, బాలకృష్ణ అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. శతజయంతిసభకు (మినీమహానాడుకు) ఎన్టీఆర్ కుమారుడు నందమూరి బాలకృష్ణ ముఖ్య అతిధిగా హాజరవుతారని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ప్రముఖ సినీ నటుడిగా, ఎన్టీఆర్ వారసునిగా బాలకృష్ణను ప్రత్యేకంగా సత్కరిస్తామని, అదేవిధంగా ఎన్టీఆర్‌తో అనుబంధం ఉన్న ప్రముఖులను, క్రీడీకారులను కూడా సత్కరించి, అవార్డులు అందచేస్తామని వివరించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయి బాబా మాట్లాడుతూ తెలుగుదేశం వ్యవస్థాపకులు, తెలుగు చలన చిత్ర రంగంలో మకుటం లేని మహరాజుగా వెలుగొందిన నందమూరి తారకరామారావు వంద సంవత్సరాల జన్మదిన వేడుకలను టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు, గ్రేటర్ అధ్యక్షులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ జయంతి సభ (మినీమహానాడు)కు యువరత్న నందమూరి బాలకృష్ణతో పాటు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, పోలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బక్కల నర్సింహులు హాజరవుతారని తెలిపారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజుగౌడ్, అధికార ప్రతినిధి, ఖైరతాబాద్ ఇన్‌చార్జి శ్రీనివాసనాయుడు, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి జివిజి నాయుడు, రాష్ట్ర నాయకులు ఆరీఫ్, ప్రశాంత్‌యాదవ్, ఎస్.ప్రకాష్, యాదగిరి, సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీపతి సతీష్, తెలుగు మహిళా నాయకులు సి.హెచ్ విజయశ్రీ పాల్గొన్నారు.

## ఆలోచింపజేసిన రసరంజని.. మహాభారతంలో మగువలు నాటకం



మహాభారతంలో మగువలు నాటకంలో ఓ దృశ్యం

రవీంద్రభారతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త : ప్రఖ్యాత సాంస్కృతిక, సాహిత్య సేవాసంస్థ రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధవారం రాత్రి నిశుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా హైదరాబాద్ వారి సమర్పణలో డా. రామ్మోహన్ హోలగుండి అనుసరణ, అనువాదం, సంగీతం, దర్శకత్వంలో మహాభారతంలో మగువలు నాటకం అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతులైన అశేష ప్రేక్షకులు, నాటకప్రియులను ఆలోచింపజేసి ఎంతగానో ఆకట్టుకుంది. రాధిక దర్శి, కృష్ణుడుగా వీరవెంకటసాయిరామ్ తదితరులు ఆయా ముఖ్యపాత్రలను పోషించగా అద్భుతంగా ప్రతీ సన్నివేశాన్ని కళ్లకుకట్టినట్లు ప్రతీఒక్కరినీ ఎంతగానో ఆకట్టుకొని ఆలోచింపజేసే విధంగా డా. రామ్మోహన్ హోలగుండి అనుసరణ-అనువాదం-డిజైన్-లైటింగ్-సంగీతం-దర్శకత్వంలో మహాభార తంలో మగువలు నాటక ప్రదర్శింపబడి అధికసఖ్యలో విచ్చేసిన రంగస్థల ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I Hema Gupta W/o Neetesh Gupta R/o 16-9-569/7/2, Old Malakpet, Hyd has changed my name to Rakhee Agarwal for all future purpose i.e affidavit 33AA/827031.

(Ro.No. 3781)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# సరూర్‌నగర్ సర్కిల్లో అక్రమ నిర్మాణాలు

## ఫిర్యాదులు చేస్తే అధికారులకు కనక వర్షం - పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు

## ఖజానాకు గండి - అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్



అక్రమ నిర్మాణాల దృశ్యం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** అధికారులకు కక్కుర్తి కారణంగా జిహెచ్ఎంసి ఆదాయానికి గండిపడుతోంది. ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఒక్క అధికారి కూడా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి స్థానికులు ఫిర్యాదులు చేస్తే నిర్మాణదారులను బెదిరించి టౌన్‌ప్లానింగ్ అధికారులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల శైలి పట్ల పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన అవినీతి అధికారులపై గతంలో అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినా చర్యలు చేపట్టకపోవడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మితిమీరి మరి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కిల్ పరిధిలో పుట్టగొడుగుల వెలుస్తున్న అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటిరెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని మూడు, నాలుగు, ఐదు అంతస్తుల నిర్మాణం చేపట్టడంవల్ల భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి న పరిస్థితి ఏర్పడుతుందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. భవన నిర్మాణాలు కూలినప్పుడు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావిడి చేసే అధికారులు నిర్మాణం జరుగుతున్న సమయంలో మాత్రం చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతోంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల చేతివాటం కారణంగానే అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకు మితిమీరుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల చేతులు తడుపుతే ఎటువంటి నిర్మాణమైన చేసుకోవచ్చు అనే విధంగా అధిక అధికారుల వ్యవహార శైలి ఉందని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్లు కబ్జాచేసి నిర్మాణాలు జరుపుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు పట్టడం లేదంటే అవినీతి ఏమేరా మితిమీరిందో బట్టబయలవుతోంది. అక్రమ నిర్మాణాలకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును గురించి ఉపకమిషనర్ దృష్టికి తీసుకువెళ్లిన ఎందుకు చర్యలు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన అక్రమ నిర్మాణాలపై వెంటనే అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## చలివేంద్రాలు బాటసారులకు మేలు చేస్తాయి

**తార్నాక, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ఎండాకాలంలో చలివేంద్రాలు బాటసారులకు ఎంతో ఉపయోగ పడుతాయని బిజేపీ నాయకురాలు బండ కార్తిక చంద్రారెడ్డి పేర్కొన్నారు. బిజేపీ నగర కార్యదర్శి మల్లికంటి వీరన్న ఆద్వర్యంలో తార్నాకచౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బిజేపి అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌గౌడ్, కార్తిక చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నిఏళ్లుగా చౌరస్తాలో ఏర్పాటు చేస్తూ ప్రజల దాహార్తిని తీర్చుతున్నామని చెప్పారు. ఇలాంటివి విరివిగా కూడళ్లలో ఏర్పాటు చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## సుల్తాన్‌వాల్వా మిని ఫంక్షన్‌హాల్‌కు రూ.84లక్షలు మంజూరు : నల్ల రఘుమారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న నల్ల రఘుమారెడ్డి తదితరులు

**సైదాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ సుల్తాన్‌వాల్వాలో అసంపూర్తిగా ఉన్న మిని ఫంక్షన్‌హాల్‌కు రూ.84లు మంజూరు కావడం జరిగిందని బిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డి తెలిపారు. స్థానికులతో కలిసి ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చొరవతో ఫంక్షన్‌హాల్ నిర్మాణం పూర్తి చేయడం కోసం మరో రూ. 84లక్షలు మంజూరు కావడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ముడుపు రాజిరెడ్డి, ఉమామహేశ్వర్, కొత్తపేట ప్రభాకర్, సామ రంగారెడ్డి, నర్సింహా, సందయ్య, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, గణేష్, మహేందర్, ధరంపాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించండి : కొల్లి నాగేశ్వరరావు

**మలక్‌పేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** వికలాంగులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భాతర వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వికలాంగుల శాఖ కమిషనర్ శైలజను కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి కింద ప్రతి వికలాంగుడికి రూ. 5 లక్షలు ఎటువంటి షూరిటీ లేకుండా ఇవ్వాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వికలాంగుడికి మోటార్ వెహికల్ ఇవ్వాలని, అర్హులైన వికలాంగులందరికీ డబల్ బెడ్ రూం ఇళ్లనుకేటాయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిక్షపతి, శ్రవణ్, గోవిందరాజు, ఫాతిమా, బాలకృష్ణ, రాఘవేందర్, యాదగిరి, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం: పురుషోత్తం



ఎఐటియుసి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న బొద్రమోని పురుషోత్తం

**సరూర్‌నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** కార్మికసంక్షేమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలో బుధవారం ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కమిటీ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్‌ల పాలనలో అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరగడం కార్మిక కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. కార్మిక హక్కులను కాపాడడంలో చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగే విధంగా కార్మికులు మేడేను ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మే1వ తేదీన పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో కార్మికులకు సెలవు దినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా కుర్మల్‌గూడ నుండి బాలాపూర్ చౌరస్తా మీదుగా వందలాది మంది కార్మికులతో భారీ ర్యాలీని నిర్వహిసా్తమని ఆయన వెల్లడించారు. మేడే కార్యక్రమాలను, ర్యాలీని అన్ని రంగాల కార్మికులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాగా సిఐటియు సర్వ సభ్య సమావేశంలో కార్మికులకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ళను ఇవ్వాలని, కార్మికులు విశ్రాంతి గదులను, టాయిలెట్లను నిర్మించాలని, కార్మికులుప్రమాదాలకు గురైతే యాజమాన్యాలే బాధ్యత వహించాలని, తగిన నష్టపరిహారం ఇవ్వాలని సమావేశంలో తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, కె.రమేష్, కృష్ణ, బి.సుజాత, రావుల ఝాన్సీ, అరుణ, నాగేంద్రమ్మ, జగదాంబ, స్వరూపతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నమ్మిన ప్రజలను నట్టేట్లో ముంచిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి : మల్‌రెడ్డి రామ్‌రెడ్డి



జోడో యాత్రలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** అభివృద్ధిపై సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తారన్న భయంతోనే ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దొంగలా చీకట్లో వచ్చి వెళ్తున్నాడని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురండివిజన్ అధ్యక్షుడు కుట్ల నరసింహయాదవ్ ఆధ్వర్యంలో హస్తినాపురం ఈస్ట్‌సిగ్నల్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి నిర్వహించిన హాత్ సే హాత్ జోడోయాత్రలో పాల్గొన్న మల్ రెడ్డి రామ్ రెడ్డి మాట్లాడుతూ సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారి అటు పార్టీకి ఇటు నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట్లో ముంచిన ఘనత ఎల్బీనగర్ ఎమ్మెల్యే ది అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రోడ్లు వేసి అభివృద్ధి చేస్తే కనీసం ఆ రోడ్లని మరమ్మత్తు కూడా చేయలేని దీనస్థితిలో ప్రభుత్వం ఉందా? అంటూ నిలదీశారు. మీటింగులు పెట్టుకొని సొంత డబ్బా కొట్టుకోవడం కాదు చేతనైతే ప్రజాక్షేత్రంలో తిరిగి ప్రజల సమస్యలను పరిష్కరించాలని హితవు పలికారు. నిన్న వచ్చిన వర్షానికి చాలాచోట్ల కాలనీలు జలమయం అయ్యాయని మరి నీవు ఏం అభివృద్ధి చేశావు అంటూ ఎమ్మెల్యేని నిలదీశారు. కెసిఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి పేద రైతుల కడుపుపై కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ రద్దు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి ఫామ్‌హౌస్‌లో పడుకొని రాజకీయాలు చేస్తున్నాడని ఒక్కరోజు కూడా సెక్రటేరియట్లో అడుగుపెట్టలేదన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ఎల్బీనగర్ ప్రజలందరూ కంకణా బద్ధులై ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాక్సుద్, మధు, మోహన్‌రెడ్డి, సదాశివుడు, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాసరావు, కిషోర్ గౌడ్, సురేందర్ రెడ్డి, గణేష్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, మతిన్, రమేష్ నాయక్, రాజశేఖర్, నాగేశ్వరరావు, భాను, మంజులరెడ్డి, సంగీత, సౌమ్య, స్వర్ణ, మాధవి, కవిత, శరత్, మక్సుద్ భాయ్, జానీ బాబా, అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల

**మన్సూరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మన్సూరాబాద్ డివిజన్‌లో బుధవారం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గణేష్‌నగర్ కాలనీ ఫేస్-2 కాలనీలో పర్యటించి స్థానికులద్వారా అక్కడ ఉన్న సమస్యలను గ్రేటర్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, కొప్పుల నర్సింహ్మారెడ్డి కాలనీ వాసులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యను దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని సంబంధిత అధికారులకు తెలిపి సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డివిజన్లో ఏ సమస్య తలెత్తిన నా దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కృష్ణా, సంజీవరెడ్డి, నర్సింహా, విజయ్, పర్వత్‌రెడ్డి, ఓంకార్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి : కార్పొరేటర్ చింతల

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలని, రాక్ హీల్స్, బాలాజీ నగర్, లక్ష్మీ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ లో బుధవారం సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించగా కార్పొరేటర్ చింతల అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని కాలనీలో పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, వాటర్ సమస్యలను, దోమల బెడద, కుక్కల సమస్యను తొందరగా పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు. అన్ని పనులను తొందరగా పూర్తి చేస్తానని కాలనీ వాసులకి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదికారులు చంద్రశేఖర్ రెడ్డి, అర్చన, సిబ్బంది, విద్యుత్ అధికారులు, సిబ్బంది, వివిధ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**సైదాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో జరిగే అన్ని అభివృద్ధి పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని సాయిగంగ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులు పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలన్నారు.

# అధ్యంతం వైభోగం స్వామివారి రథోత్సవం

## ఘనంగా అష్టలక్ష్మి దేవాలయం వార్షికోత్సవం



భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** స్వామివారి రథోత్సవ కార్యక్రమం వేలాదిమంది భక్తుల కోలాహలం మధ్య అధ్యంతం వైభవంగా నిర్వహించారు. దేవాలయం మాడవీధులలో స్వామివారి రథోత్సవంలో కేరళ నుంచి వచ్చిన కళాకారులు ఆటపాటల మధ్య భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు కార్యక్రమం అభ్యంతరం ముందుకు సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయం 27వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి సింహవాహన సేవ, రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం శ్రీ లక్ష్మీ నారాయణనేష్టి, మహాపూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్రతీర్థం, కల్పవృక్ష వాహన సేవ తదితర కార్యక్రమాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తుశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు అన్నప్రసాదం, మజ్జిగ, మంచినీరు కూడా ఆలయ కమిటీ పంపిణీ చేసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా గత ఆరు రోజులుగా వాసవి కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, బ్రహ్మోత్సవ కమిటీ కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్, ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, కమిటీ సభ్యులు చిలుకా ఉపేందర్‌రెడ్డి, బొగ్గరపు రవీందర్, తమ్మన శ్రీధర్, గండి శ్రీకాంత్, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తా : కౌన్సిలర్ కాకుమాను సునీల్

**తుర్కయంజాల్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి సహాయ సహకారాలతో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు భవానిపురం కాలనీలో నూతనంగా డ్రైనేజ్ పనులకు 10 లక్షల రూపాయలతో డ్రైనేజ్ శంకుస్థాపన చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సునీల్ బుధవారం వారు మాట్లాడుతూ 18వ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్డు, ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీళ్లు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆయన అన్నారు. 18 వార్డులో కాలనీవాసులకు ఎలాంటి సమస్యలున్న చైర్‌పర్సన్, అధికారుల సహాయ సహకారాలతో ముందుండి కాలనీలు అభివృద్ధి చేయిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ మెంబర్స్ రామయ్య, సుధాకర్, రమేష్, రాజు, రవి, ప్రభాకర్, భరత్‌రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

## డివిజన్ సమగ్రాభివృద్ధికి చర్యలు : శ్వేత



చెట్ల కొమ్మల తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. ఇంద్రప్రస్థ కాలనీలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌తో జిహెచ్ఎంసి నిర్వహించిన పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు, మ్యాన్ హోల్ స్ మరమ్మత్తులు, నూతన రోడ్లగురించి కాలనీ సంక్షేమసంఘాల నుంచి ఫిర్యాదులు రావడం జరిగిందని, వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో అధికారులు నర్సింహా, రత్తమ్మ, అన్సారీతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**చెట్ల కొమ్మల తొలగింపు...** వైశాలినగర్, బృందావన్ కాలనీ, నాగార్జున కాలనీలలో రోడ్డు మీదకు వచ్చి వాహనదారులకు, స్థానికులకు ఇబ్బందికరంగా మారిన చెట్ల కొమ్మలను సంబంధిత సిబ్బందిని పిలిపించి కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి తొలగింప చేశారు.

## అకాల వర్షాల వల్ల నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలి : అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** అకాల వర్షాల వల్ల మహేశ్వరం నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ పంటలు చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలు, వడగళ్ళ వానల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో వరి, మొక్క జొన్న, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్న రైతులకు అకాల వర్షాలు శాపంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో పంట నష్టంపై విచారణ చేయించి రైతులను ఆదుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరారు. బిజెపి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అనుబంధ శ్రేణుల నేతలు అన్నదాతలకు అండగా నిలబడి వారికి భరోసా కల్పించాలని అందెల సూచించారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : సైపుద్దీన్ షఫీ



ఓల్డ్ మలక్‌పేటలో పర్యటిస్తున్న సైపుద్దీన్ షఫీ

**మలక్‌పేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఓల్డ్ మలక్‌పేట డివిజన్ ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీ పేర్కొన్నారు. డివిజన్‌లోని పద్మనగర్‌లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను జిహెచ్ఎంసి డిఇ ప్రదీప్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఇప్పటివరకు డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడం జరిగిందన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడడానికి ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను కోరారు. నిత్యం డివిజన్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి పథకం నిరు పేదలకు ఆసరా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** కళ్యాణలక్ష్మి పథకం పేదలకు ఆర్థికంగా ఆసరాగా నిలుస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సరూర్‌నగర్, ఉప్పల్ మండలాలకు చెందిన 185 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందని తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్‌గుప్తా, సరూర్‌నగర్ తహసిల్దార్ జయశ్రీ, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో చల్లా



భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌లో పాల్గొన్న చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సాధక బాధలను తెలుసుకోవడానికి సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పాల్గొన్నారు. బుధవారం వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రారంభమైన యాత్రకు ఆయన పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భట్టి విక్రమార్క, మాజీ పిసిసి అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య తదితరులతో కలిసి పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో పాల్గొని అకాల వర్షాల వల్ల నష్టానికి గురైన రైతుల పంటలను పరిశీలించారు.

## వర్షపు నీరు రోడ్లపై చేరడంతో ఇబ్బందులు సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** బి.యన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్‌లో మంగళవారం రాత్రి కురిసిన వర్షాల కారణంగా వర్షపు నీళ్ళు రోడ్లపై చేరి ఇబ్బందికరంగా మారాయని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి సమాచారం అందజేశారు. దీంతో కార్పొరేటర్ ఎఇ దామోదర్‌రావుతో కలిసి పర్యవేక్షించారు. కాలనీలోని రోడ్స్, డ్రైనేజ్ పైప్ లైన్, ఓపెన్ నాలాలోనుంచి వర్షపు నీరు పోయే విధంగా సంబంధిత సిబ్బందితో చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు సుధాకర్‌గౌడ్, రాంగోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్ డివిజన్‌లో విడిసిసి రోడ్లు ప్రారంభం

**సైదాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎస్‌బిహెచ్ కాలనీ, ఆస్మాన్‌ఘడ్‌లలో నూతనంగా నిర్మించిన విడిసిసి రోడ్లను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో రోడ్లు, యుజిడి, త్రాగునీరు, వీది దీపాలు వంటి మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీతామహాలక్ష్మి, మంజుల రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాలో రోగులకు మెరుగైన సేవలు : కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



బస్తీ దవాఖానాలో మందులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ దేవేందర్‌రెడ్డి

**నాచారం, మార్చి 26 ప్రభాతవార్త:** బస్తీ దవాఖానాలో రోగులకు మెరుగైన సేవలను అందజేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని మల్లాపూర్ కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మర్రిగూడ బస్తీ దవాఖానాను సందర్శించి రోగులతో మాట్లాడి ఏమైనా సమస్యలున్నాయా మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ పన్నాల మాట్లాడుతూ దవాఖానాలో అవుట్ పేషెంట్ సేవలతో పాటు బీపీ, షుగర్, బీపీ వంటి సుమారు 57 రకాల వైద్య సేలను వైద్యులు అందించడంతో పాటు 150 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నారని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీకాలు వేయడం, కుటుంబ నియంత్రణ వైద్య పరమైన కౌన్సిలింగ్ ఇస్తారని ఈ దవాఖానాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. సింగంచెరువు తండా, అశోక్‌నగర్, ఎస్వీనగర్, సూర్యనగర్ తధితర ప్రాంతాల ప్రజలు ఈ బస్తీదావఖానాను వినియోగిచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖానా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి ముంపు ప్రాంతాలను సందర్శించిన కార్పొరేటర్ శాంతిశేఖర్

**నాచారం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లో రాత్రి కురిసిన వర్షానికి కొన్నిప్రాంతాల్లో నాలాలు పొంగిపొర్లాయి దీంతో విషయం తెలుసుకున్న కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ ముంపు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, జల మండలీ అధికారులతో కలిసి సందర్శించి అధికారులను అప్రమత్తం చేశారు. అదేవిదంగా ఏఈ లింగారావుతో కలిసి జేసీబీ ద్వార బ్రిడ్జి నిర్మాణం కోసం వేసిన కట్టను తొలగింపజేయించారు. దీంతో వర్షపునీరు సాఫీగా వెళ్లింది. బుధవారం కూడా సమస్యలు ఉన్నా ప్రాంతాను వారు సందర్శించారు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కార్పొరేటర్ హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ట బుచ్చన్నగౌడ్, నర్సింగ్‌రావు, జావేద్, హరిప్రసాద్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.